# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 19-07-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **అల్పపీడనం ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి.**

**2.** **వర్షాల నేపథ్యంలో ముందస్తు సహాయక చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు.**

**3.** **రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపులోనే ఉన్నాయని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు.**

**4.** **పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందరేశ్వరి కోరారు.**

**5.** **ఫాస్టాగ్‌ను వాహనాల ముందు అద్దంపైనే అతికించాలని, లేదంటే రెట్టింపు టోల్ వసూలు చేయనున్నట్లు భారత జాతీయ రహదారుల సంస్థ స్పష్టం చేసింది.**

6. **విజయవాడ ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో శాకంబరీ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.**

=============================

బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రతి జిల్లాలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర హోం మంత్రి వి.అనిత తెలిపారు. వర్షాలు, వరద ప్రభావం ఎక్కువగా ఉన్న ఏలూరు, అనకాపల్లి జిల్లాల కలెక్టర్లతో మాట్లాడి తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. రాజమహేంద్రవరం వద్ద గోదావరి ఉధృతి పెరిగింది. ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ వద్ద నీటిమట్టం 10.8 అడుగులకు చేరుకుంది. దీంతో సముద్రంలోకి 3.50 లక్షల క్యూసెక్కులకు పైగా నీటిని విడుదల చేస్తున్నారు.

ఉమ్మడి విశాఖ జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి.ఈ నేపథ్యంలో జిల్లాలోని అన్ని విద్యాసంస్థలకు జిల్లా కలెక్టర్ ఎమ్.ఎన్. హరేంధిర ప్రసాద్ సెలవు ప్రకటించారు. అనకాపల్లి జిల్లాలోనూ కురుస్తున్న వర్షాలకు తాండవ, వరాహ నదుల్లోకి వరద నీరు వచ్చి చేరుతోంది. అనకాపల్లి జిల్లాలోని విద్యాసంస్థలకు ఈరోజు కలెక్టర్ విజయకృష్ణన్ సెలవు ప్రకటించారు.

కోనసీమ జిల్లాలో బూరుగులంక వద్ద గోదావరిలో తాత్కాలిక రహదారి కొట్టుకుపోయింది. విలీన మండలాల్లోనూ వాగులు పొంగుతున్నాయి. చింతూరు వద్ద శబరి వరద అంతకంతకు పెరుగుతోంది. కోనసీమలోని రాజోలు, ముమ్మిడివరం నియోజకవర్గాల్లోనూ వర్షాలు కురుస్తున్నాయి.

అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలం రాయగడ్డ, పరదానిపుట్టు వద్ద మత్స్యగెడ్డ వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. జి.మాడుగుల మండలం కుంబిడిసింగి బ్రిడ్జిపై వరద ప్రవాహంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అల్లూరి జిల్లాలో అన్ని విద్యాసంస్థలకు ఈరోజు, రేపు కలెక్టర్ సెలవు ప్రకటించారు.

ఏలూరు జిల్లాలోని మన్యం గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. దీంతో ఏజెన్సీ ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అలివేరు, జల్లేరు, బైనేరు వాగు, అశ్వారావుపేట, పడమటి వాగులు పొంగుతున్నాయి. పోలవరం ప్రాజెక్టు వద్ద గోదావరి నీటిమట్టం భారీగా పెరుగుతోంది.

విజయనగరం జిల్లాలో కురుస్తున్న వర్షాలకు వాగులు పొంగిపొర్లుతున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలోని అన్ని పాఠశాలలకు జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఈరోజు సెలవు ప్రకటించారు.

---------------------------

రాష్ట్రంలో భారీ వర్షాలు, వరద పరిస్థితులపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉండవల్లిలోని నివాసంలో దృశ్యమాధ్యమం ద్వారా ఆయా జిల్లాల కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో 8 జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఆయా జిల్లాల్లో పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. చెరువులు, వాగుల్లో ప్రవాహాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. జలవనరుల శాఖ, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. అధికారులు పూర్తి అప్రమత్తంగా ఉంటూ.. నిరంతరం పర్యవేక్షించాలని ముఖ్యమంత్రి సూచించారు.

---------------------------

ఈ నెల 23 నుంచి జరగనున్న పార్లమెంటు బడ్జెట్ సమావేశాలలో నిర్వహణ సవరణ బిల్లుతో సహా ఆరు కొత్త బిల్లులను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. ఈ మేరకు ప్రవేశపెట్టనున్న బిల్లుల జాబితాను లోక్సభ సచివాలయం విడుదల చేసింది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో విపత్తు నిర్వహణ బిల్లుతో పాటుగా, ఆర్థిక బిల్లు, పౌర విమానయాన రంగంలో సులభతర వాణిజ్యానికి వీలు కల్పించే ఎయిర్క్రాఫ్ట్ చట్టం 1934 స్థానంలో ప్రభుత్వం భారతీయ వాయుయాన్ విధేయక్ 2024ను ప్రవేశపెట్టనుంది. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ఈనెల 22న ప్రారంభమై ఆగస్టు 12 వరకు కొనసాగుతాయి. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈనెల 23న కేంద్ర బడ్జెట్ను సభలో ప్రవేశపెడతారు.

---------------------------

రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపులోనే ఉన్నాయని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. తిరుపతిలో హోంమంత్రి ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ, కొందరు కావాలనే అలజడులు సృష్టించి ప్రజలను భయాందోళనకు గురి చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ప్రజలు ఎలాంటి భయాందోళనకు గురికావద్దని వీటి పట్ల ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. పుంగనూరు, పల్నాడు ఘటనలపై పూర్తిస్థాయి విచారణ జరుగుతోదని మంత్రి తెలిపారు.

---

పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి అమ్మ కోసం ఒక చెట్టు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందరేశ్వరి పిలుపునిచ్చారు. బాపట్ల జిల్లా కారంచేడులోని బిజెపి పార్టీ శ్రేణులతో ఆమె సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రపంచ వ్యాప్తంగా నెలకొన్న వాతావరణ మార్పుల సమస్యకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభించిన 'ఏక్ పెడ్ మా కే నామ్' అమ్మ కోసం ఒక చెట్టు సరైన పరిష్కారమని చెప్పారు. మొక్కలు పర్యావరణానికె కాక మానవాళికి కూడా మేలు చేస్తాయని తెలిపారు.

---

ఫాస్టాగ్‌ను వాహనాల ముందు అద్దంపైనే అతికించాలని, లేదంటే రెట్టింపు టోల్ వసూలు చేయనున్నట్లు భారత జాతీయ రహదారుల సంస్థ –ఎన్‌హెచ్ఎఐ స్పష్టం చేసింది. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను ఎన్‌హెచ్ఎఐ జారీ చేసింది. కొంతమంది ఉద్దేశపూర్వకంగా ఇతర అద్దాలపై ఫాస్టాగ్ ను అంటిస్తున్నారని, దీనివల్ల టోల్ గేట్ల వద్ద ఆలస్యం అవుతోందని, మిగిలిన వాహనదారులకు ఇబ్బంది కలుగుతోందని పేర్కొంది. ప్రతి వాహనదారుడూ ముందు అద్దంపై బయటకు కనిపించేలా కారు లోపలి నుంచి ఫాస్టాగ్ ను అంటించాలని సూచించింది.

---

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని బారాషహీద్ దర్గాలో మూడోరోజు రొట్టెల పండగ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్కడికి వచ్చిన భక్తులతో అమరావతి నుంచి ఈ రోజు దృశ్య మాధ్యమం ద్వారా మాట్లాడారు. రొట్టెల పండగ నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. వేడుకల నిర్వహణకు 5 కోట్ల రూపాయల నిధులు కేటాయించామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

మరోవైపు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నీతి ఆయోగ్ ముఖ్య కార్యనిర్వహణాధికారి బివిఆర్ సుబ్రహ్మణ్యం, సంస్థ ప్రతినిధులతో అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఈరోజు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో విజన్ 2047 ప్రణాళిక, రాష్ట్ర అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యక్రమాలు, ప్రాజెక్టులపై చర్చిస్తారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

---

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్– ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో ఈనెల 28 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు నిర్వహించే శాఖాపరమైన పరీక్షలకు రాష్ట్ర వ్యాప్తంగా 16 జిల్లా కేంద్రాల్లో ఏర్పాట్లు చేసినట్టు సర్వీస్ కమిషన్ కార్యదర్శి ప్రదీప్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. మొత్తం 33,603 మంది పరీక్షలకు దరఖాస్తు చేసుకున్నారని, ఈ రోజు నుంచి జూంఎ.ఖజూ.ప్రశీజ.ఙఅ వెబ్ సైట్ నుండి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.

---

పొందూరు ఖద్దరు తయారీపై రాష్ట్ర చేనేత, జౌళి శాఖ వీడియో చిత్రీకరణ పోటీలను నిర్వహిస్తోంది. ఈ మేరకు రాష్ట్ర చేనేత, జౌళి శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. ఖాదీ తయారీలోని అన్ని దశలపై వీడియో చేసి సంబంధిత అధికారులకు పంపాలని సూచించింది. ఆగస్టు 7వ తేదీన నిర్వహించనున్న జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపింది. పోటీల్లో పాల్గొనే వారు తాము రూపొందించిన వీడియోలను

మంగళగిరిలోని చేనేత, జౌళి శాఖ కమిషనర్ కార్యాలయంలో ఆగస్టు 1వ తేదీలోగా సమర్పించాలని కోరింది. వీడియోల్లో ఉత్తమ వీడియోను ఎంపిక చేసి, రాష్ట్ర ప్రభుత్వం తరపున నగదు పారితోషికం, ప్రశంసాపత్రాన్ని ఇవ్వనున్నట్లు ప్రకటనలో పేర్కొంది.

---------------------------

విజయవాడ ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో శాకంబరీ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ప్రతి ఏటా ఆషాడ మాసంలో మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ఉత్సవాలు విఘ్నేశ్వర పూజతో ప్రారంభం అయ్యాయని ఆలయ అధికారులు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని రకరకాల కూరగాయలతో అలకరించారు. ఈరోజు నుంచి మూడు రోజుల పాటు అమ్మవారు శాకంబరి రూపంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. అమ్మవారిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుంటున్నారు.

---------------------------

టమాటా ధరలు పెరుగుతున్న నేపథ్యంలో వాటిని వినియోగదారులకు తక్కువ ధరకే అందించేందుకు చర్యలు చేపట్టామని మార్కెటింగ్ కమిషనర్ జి.శేఖర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. అధిక పరిమాణంలో టమాటా పంటను కొనుగోలు చేసి రైతు బజార్ల ద్వారా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రైతు బజార్ల ద్వారా 46 నుంచి 62 రూపాయలకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. టమాటాలను చిత్తూరు, అనంతపురం, అన్నమయ్య జిల్లాల్లోని మార్కెట్ల నుంచి కొనుగోలు చేసి, రైతు బజార్లకు సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు.

---------------------------

అన్ని రంగాల్లో సాంకేతికతను వినియోగించుకుని సుస్థిరమైన అభివృద్ధి సాధించేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం– షార్ డైరెక్టర్ ఎ.రాజరాజన్ అన్నారు. కృష్ణా జిల్లా కానూరులోని విఆర్ సిదార్ధ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన 'గ్రీన్ అండ్ సస్టెయినబుల్ టెక్నాలజీస్' అంశంపై రెండు రోజులు నిర్వహించనున్న సదస్సును ఆయన నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా షార్ డైరెక్టర్ ఎ. రాజరాజన్ మాట్లాడుతూ ప్రస్తుతం భూమిపై ఉష్ణోగ్రతలు పెరిగి ఆక్సిజన్ తగ్గడంతో అనేక సమస్యలు తలెత్తుతున్నాయని చెప్పారు. ఈ సమస్యలను అధిగమించాలంటే స్థిరమైన సాంకేతికతతో అభివృద్ధి సాధించాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్‌ని దృష్టిలో పెట్టుకుని అడవులు పెంచటం, నీటివనరులను కాపాడటం, ఉష్ణోగ్రతలు తగ్గించే విధంగా గ్రీన్ ఎనర్జీని వినియోగించటం వంటివి చేపట్టాలని పేర్కొన్నారు.

======================